క్లుప్తంగా

మల్లన్నను దర్శించుకున్న దేవదాయశాఖ కమిషనర్



కమిషనర్ ఎస్ సత్యనారాయణకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను దేవదాయశాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

నేడు 'పల్లెకు పోదాం'

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామ సచివాలయం వద్ద మంగళవారం మానమ్మకం నువ్వే జగన్–పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ ,ఈఓ పీఆర్డీ మధుమోహనచక్రవర్తి సోమవారం తెలిపారు. పారుమంచాల సర్పంచ్ మాధవరం ప్రకాశం అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు నిర్వహించే కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరవుతారని చెప్పారు.

చంద్ర పుల్లారెడ్డి స్థూపం ఏర్పాటు చేయాలి

నందికొట్కూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, పేదలకు సొంత భూములు పంపిణీ చేసిన చంద్ర పుల్లారెడ్డి స్మారక స్థూపం, విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గానికి మొదటి శాసన సభ్యుడిగా సీపీఐ పార్టీ తరుపున చంద్ర పుల్లారెడ్డి విజయం సాధించారన్నారు. నాయకులు ప్రేమరాజు, ఎస్‌కే జూనైద్‌బాషా, రామాంజనేయులు, శివ, సుధాకర్, తదితరులు ఉన్నారు.

రేపు పూలే వర్ధంతి సభ

ఆత్మకూరు: పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్‌లో మంగళవారం నిర్వహిస్తున్న మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి సభను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షులు వెంకటస్వామి గౌడ్, బాలస్వామి యాదవ్ పిలుపునిచ్చారు.పూలే దేశ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని, ఆయన చేసిన సేవలను గుర్తించుకుంటూ వర్ధంతి సభను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, బహుజనులు హాజరుకావాలని కోరారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

నందికొట్కూరు రూరల్: శనగ పంటను సాగు చేసే రైతులు తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఏఓ షేక్షావలి సూచించారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతులకు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ శనగ విత్తనాలకు ట్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేసుకొని పొలంలో రక్షిక పంటలైన జొన్న, ధన్యాల సాగు చేసుకోవచ్చని సూచించారు.వీఏఏ శాంతరాజు, రైతులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్ అన్నారు. పట్టణంలోని 14 వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. రూ.5.50 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని సంఘం డెయిరీలో ఐస్‌ఫ్యాక్టరీని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయచౌదరి, మోతుల్లా, రెహమాన్, షాలుఫైల్మాన్, శ్రీనివాసులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

మిడుతూరు: నూతనంగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలించడంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌బీకే, సచివాలయ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భారతి, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి, ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అవినీతిని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే బుడ్డా చేస్తున్న ఆరోపణల్లో ఏ ఒక్కటైనా నిరూపించాలని సవాల్
- వర్ధన్ బ్యాంకులో అవినీతి జరిగి ఉంటే.. కేసులు ఎందుకు నమోదు చేయలేదు?
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, చిత్రంలో జూటూరు మహమ్మద్ ఖాసీం, కత్తుల కోటేశ్వరరావు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం నియోజకవర్గంలో తాను అవినీతికి పాల్పడ్డానని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు ఏ ఒక్కటి నిరూపించినా తాను రాజీనామకు సిద్ధమని అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి సవాలు విసిరారు. సోమవారం శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో ఏపీజెన్‌కో గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు వర్ధన్‌బ్యాంక్‌లో రూ.4 కోట్ల అవినీతికి పాల్పడ్డానని పదేపదే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆరోపించడం సమంజసం కాదన్నారు. అదే నిజమైతే తనపై ఎందుకు కేసులు నమోదు చేయించలేదని ప్రశ్నించారు.

'నీరు–చెట్టు'లో రూ. 100 కోట్లు దోచుకున్నది నీవుకాదా?

నాలుగు సార్లు శ్రీశైలం నియోజకవర్గంలో పోటీ చేసి.. ఒకే ఒక్క సారి అదికూడా 'వైఎస్సార్‌సీపీ జెండాపై గెలిచి, పదవీకాలం తీరకుండానే రూ.18 కోట్లకు అమ్ముడుపోయి తెలుగుదేశం పార్టీలో చేరిన నీవా నన్ను విమర్శించేది' అని మాజీ ఎమ్మెల్యే బుడ్డాపై ఎమ్మెల్యే శిల్పా మండిపడ్డారు. నీరు–చెట్టు పనులను అడ్డం పెట్టుకుని రూ.100 కోట్లను దోచుకున్నదినీవు కాదా..? అని ప్రశ్నించారు. ఆత్మకూరులో నీ తమ్ముడు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డితో ముస్లిం సోదరులపై దాడి చేయించిన చరిత్ర నీదన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో నీ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాలు చేసినా ఏ మాత్రం అభివృద్ధి చేశారో చూపించాలని సవాలు విసిరారు. మీ రాజకీయ పాలనలో రౌడీయిజం చేశారే తప్పా అభివృద్ధి ఎక్కడ చేశారని ప్రశ్నించారు.

రూ.13 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు

శ్రీశైలం నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా అయిన తర్వాత సుమారు రూ.13 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. వెలుగోడులో రూ.210 కోట్లతో ముస్లిం సోదరులకు మసీదు, షాదీఖానా, రుఖియాబీ దర్గా నిర్మిస్తుండడం నీ కళ్లకు కనిపించడం లేదా.? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరులో బస్టాండ్, ఆసుపత్రి, స్టేడియం నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు నీకు తెలియడం లేదా అని ప్రశ్నించారు.

అభివృద్ధి పథంలో శ్రీశైలం మండలం..

శ్రీశైలం మండలంలో ప్రత్యేకంగా నాలుగు సచివాలయాలు, రెండు వైఎస్సార్ క్లినిక్‌లు, రూ.16.5 కోట్లతో సున్నిపెంటలో మంచినీటి సరఫరాకు పైప్ లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించడంతో పాటు గ్రామంలో సీసీ రోడ్లను వేసి అభివృద్ధి పథంలో పయనిస్తున్నామని శిల్పా అన్నారు. గత 24న ఆత్మకూరులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమంలో గతంలో నీవు నన్ను బూతులతో తిట్టడాన్ని జీర్ణించుకోలేక నా కుమారుడు మాట్లాడాడని, చేతనైతే నా కుమారుడితో తలపడాలని సవాల్ విసిరారు. పవిత్ర శివమాలా ధారణలో ఉండి, బూతులతో మాట్లాడడానికి వీలుకాని భాషలో మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారని, నీ నాశనానికి నీ నోటి మాటలే దారి చూపుతాయని శిల్పా విమర్శించారు.

ఎవరు అవినీతి పరులో ప్రజలకు తెలుసు..

గతంలో నీ అనుచరులు రామలింగారెడ్డి, మహేశ్వర రెడ్డి బీజేపీకి సపోర్ట్ చేయించలేదా..?, డబ్బులకు అమ్ముడు పోయి లోకల్‌బాడీ ఎలక్షన్లలో నామినేషన్ వేసిన వారితో విత్‌డ్రా చేయించలేదా?. ఎవరు అవినీతి పరులో నియోజకవర్గంలోని ప్రజలందరికీ తెలుసని బుడ్డాను ఉద్దేశించి ఎమ్మెల్యే అన్నారు. మా మంచి తనాన్ని చేతకాని తనంగా తీసుకుని నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నియోజకవర్గ ప్రజలు ఊరుకోరని.. నీ నోటికి తాళం వేసే రోజులు వస్తున్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ తెలుగు దేశం పార్టీ నాయకులు కత్తుల కోటేశ్వర రావు, జూటూరు మహమ్మద్ ఖాసీం మాట్లాడుతూ బుడ్డా రాజశేఖర్ తండ్రి వెంగళరెడ్డి నుంచి వారి రాజకీయ పరిపాలనను చూశామని.. పదవులపై వ్యామోహంతో నియోజకవర్గ అభివృద్ధిని 40 ఏళ్లుగా వదిలేశారన్నారు. గత తెలుగుదేశం హయం లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు మాకు అప్పగించి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి 10 శాతం లంచాన్ని అడిగారని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కును ఈశ్వరయ్యకు అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీశైలంప్రాజెక్ట్: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సున్నిపెంట గ్రామంలో బాధితులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కల్లకుంట ఈశ్వరయ్య కుమారుడికి రూ.2,20,000, ఈశ్వరయ్యకు రూ.70 వేల చెక్కును శిల్పా అందజేశారు.

నేడు ఆత్మకూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్పీజీపాలెం సచివాలయం–2 పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు ఎస్పీజీపాలెంలో సచివాలయం – 2 పరిధిలోని గొల్లపేట అరుగు వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మండలంలోని బాపనంతపురం గ్రామంలో వై ఏపీ నీడ్స్‌జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



సిబ్బందికి సూచనలిస్తున్న ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసంలో మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. కార్తీక రెండవ సోమవారం, మధ్యాహ్నం వరకు పౌర్ణమి ఘడియలు ఉండడంతో పరమ శివుడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ క్యూలైన్లు, ఉచిత కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. స్వామిఅమ్మవార్ల ఉచిత దర్శనానికి సుమారు 6 గంటలు, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనానికి 3గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఆలయ క్యూలైన్ల వద్దకు చేరుకుని మధ్యాహ్నం వరకు ఉండి స్వయంగా పర్యవేక్షించారు. వృద్ధులు, చంటి పిల్లల తల్లులు ఇబ్బందులు పడకుండా త్వరితగతిన దర్శనం చేయించేలా అధికారులను ఆదేశించారు. చైర్మన్ తో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు మేరాజోత్ హనుమంత్‌నాయక్, తన్నీరు ధర్మరాజు ఉన్నారు.

మహానందిలో దేవదాయశాఖ ఆర్‌జేసీ



ఆర్‌జేసీకి మెమంటో అందిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో సోమవారం దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి మెమెంటో, ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. కార్యక్రమంలో ఏఈఓ వై. మధు, కొత్తూరు సుబ్రహ్మణేశ్వర స్వామి దేవస్థానం ఈఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు రిజిస్ట్రేషన్ చేసుకోండి



ఆడుదాం ఆంధ్ర లోగో, మస్కట్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్

పాములపాడు: 'ఆడుదాం ఆంధ్ర' 2023 క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడాకారులే స్వయంగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని ఎంపీడీఓ గోపీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర లోగో, మస్కట్‌ను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు పైబడినబాల బాలికలకు కబడ్డీ, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించబడునని వివరించారు. గ్రామ/వార్డు సచివాలయం డిసెంబర్ 15 నుంచి 20 వరకు, మండల స్థాయిలో 21నుంచి 2024 జనవరి 4వరకు, నియోజకవర్గం స్థాయిలో జనవరి 11 నుంచి 21 వరకు, రాష్ట్ర స్థాయిలో జనవరి 22 నుంచి 28 వరకు క్రీడా పోటీలు నిర్వహించబడుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 1902కి కాల్ చేసి లేదా ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లోనే పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలును కల్పించారన్నారు. ఇందు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించిట్లు వివరించారు.

పేర్లు నమోదు చేసుకోండి

వెలుగోడు/పగిడ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' 2023 క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాట్మింటన్ డబుల్స్, ఖోఖో క్రీడా పోటీలలో పాల్గొనే వారు తమ పేర్లను గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓలు షేక్ అమానుల్లా, వెంకటరమణ సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత గ్రామ సచివాలయ వలంటీర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిర్మిస్తున్న సీసీ రోడ్లను కాంట్రాక్టర్లు నాణ్యతలోపం లేకుండా చూసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. సోమవారం మండలంలోని చిన్నగుమ్మడాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పీఆర్ ఏఈ రామయంద్రయ్యతో కలసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పర్యటించినప్పుడు గ్రామస్తులు సమస్యను ఆయనకు తెలియజేశారన్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించారు. దీంతో తెలుగు మల్లయ్య ఇంటివద్ద నుంచి చిన్నతిరుపాలు ఇంటి వరకు సుమారు 88 మీటర్ల సీసీ రోడ్డును రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎండీ.రఫీ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం



ట్రాన్స్ కో ఏఈ, సిబ్బందిని సన్మానించిన సర్పంచు మేకల భాగ్యమ్మ

పాములపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారమైంది. టాన్స్‌కో ఏఈ అబ్దుల్ హఫీజ్ చొరవతో సోమవారం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో సర్పంచు మేకల భాగ్యమ్మ.. ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, లైన్‌మెన్ నాగిరెడ్డిలను దుశ్శాలువాలతో సత్కరించారు. ఆమె మాట్లాడుతూ చాలా ఏళ్లుగా కాలనీలో విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాలనీలో దాదాపు 500 సర్వీసులు ఉండగా.. 60కేవీ టాన్స్‌ఫార్మర్ ఉంది. దీంతో విద్యుత్ సమస్య తీవ్ర తరంగా ఉండేది. విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి సత్వరమే చర్యలు చేపట్టారు. ఇక నుంచి కాలనీలో విద్యుత్ సమస్య ఉండబోదని తెలిపారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ మేకల భాస్కర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



సంగమేశ్వరాలయంలో నీటిలోని శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు



ఓంకారంలో భక్తులసందడి



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి



మహానందిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: కార్తీకమాసం మండలంలోని పుణ్యక్షేత్రాలు కిక్కిరిసి పోయాయి. సోమవారం కార్తీక పౌర్ణమి రావడంతో మండలంలోని పవిత్ర ప్రాచీన పుణ్య క్షేత్రాలైన సంగమేశ్వరం, సరస్వతి మాత వెలసిన కొలనుభారతిదేవి ఆలయంలో భక్తుల సందడితో కార్తీక శోభ నెలకొంది. సంగమేశ్వరంలో భక్తులు కృష్ణాజలాలో పుణ్యస్నానాలు ఆచరించి నీటిలోని శివలింగానికి విశేష పూజాది క్రతువులు జరుపుకున్నారు. అదేవిధంగా కొలనుభారతి దేవి ఆలయంలో సరస్వతిదేవికి విశేష పూజలు చేసుకొన్నారు. అదేవిధంగా సప్తశివాలయాల్లోకూడా భక్తులు ప్రత్యేక పూజలు చేసుకొన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కోటీ దీపోత్సవ వేడుకలు

పగిడ్యాల: సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లోని నాగేశ్వరస్వామి, నందీశ్వర, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయాల్లో నిర్వహించిన కోటీ దీపోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నాలుగు గంటలకే చన్నీటితో స్నానం ఆచరించిన భక్తులు గంగపూజ నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తిప్రవృత్తులతో శివకేశవులకు పూజలు నిర్వహించి కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

రుద్రకోడూరు క్షేత్రంలో విశేషపూజలు

ఆత్మకూరు: నల్లమల అటవీపరిధిలోని శ్రీరుద్రకోడూరు క్షేత్రంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా సోమవారం రుద్రాణి, రుద్రకోటేశ్వరస్వామి సన్నిధిలో విశేషపూజలు నిర్వహించారు. భక్తులు వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

వెలుగోడు: మండలంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణ శివారులోని వన్ ఆర్ తూము వద్ద సర్వేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి శివుడిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఉదార్ శంకర్‌రెడ్డి, తాళ్లూరి సంజీవరాయప్రసాద్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బల్లాని వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్యనారాయణవ్రతం, జ్వాలా తోరణం నిర్వహించారు. పట్టణంలోని విఘ్నేశ్వర ఆలయం, లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేల్పనూరు గ్రామంలోని అంకాల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి జ్వాలా తోరణం 'ఏళఇఘఇచఆఐఊ. గుంతకందాల రస్తాలోని కాశీరెడ్డి నాయన ఆలయ ప్రాంగణంలో 20 భజన బృందాలతో భజన చేశారు.

భక్తులతో పోటెత్తిన మహానంది

మహానంది: కార్తీకమాసం, పౌర్ణమి, రెండో సోమవారం కలిసి రావడంతో మహానంది క్షేత్రం భక్తులతో పోటెత్తింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. వేకువజామున నుంచి రాత్రి వరకు నిర్విరామంగా దర్శనం కొనసాగింది. స్వామివారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలు ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ఉండి భక్తులరద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అదేవిధంగా శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి దంపతులకు రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. పల్లకిసేవలో విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఓంకారం

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం ఓంకారం ఆలయం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా రద్దీ కొనసాగింది. భక్తులు శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం ,కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. నంద్యాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది.

అదిగో పులి.. ఇదిగో పిల్లి



పులి కూనను పోలిన జంగం పిల్లి పిల్ల

ఆత్మకూరురూరల్: ముష్టపల్లె – నల్లకాల్వ గ్రామాల నడుమ ఉన్న పొలాల్లో పులి పిల్లను పోలిన పిల్లి కూన కనిపించి స్థానికులను కంగారు పెట్టింది. నిజానికి ఆ కూన జంగం పిల్లిగా పిలువబడే జంగిల్ క్యాట్. అటవీ అధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. పిల్ల తల పెద్దదిగా ఉన్నందున , తల దగ్గర కాస్త బంగారు వర్ణం మరక ఉండడంతో అందరు ఇది పులి పుల్లే అని భ్రమ పడ్డారు. నిజంగా పులి పిల్లే అయితే తల్లి పులి అంత సులభంగా అక్కడ వదిలేసి వెళ్లదు. జంగం పిల్లి కూడా అంతే కాని అక్కడ జనసంచారం ఉండడంతో కాస్త దూరం వెళ్లి ఉండవచ్చు. అలా వదిలేస్తే తల్లి వెంట ఆ కూన వెళ్లి పోతుందని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక హోమాలు

శ్రీశైలంటెంపుల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం శ్రీశైలంలోని అమ్మ నీ దయ ఆశ్రమంలో ప్రత్యేక హోమాలను నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి ఆశోకనంద భారతి సూచనలతో మారుతిశర్మ ఆధ్వర్యంలో రుద్రహోమం, గణపతి హోమం, వనదుర్గ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు, సాధు సంతువులకు అన్నదానం చేశారు. ఆశ్రమ అధ్యక్షులు వై.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించండి

ఆత్మకూరు: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని ఏకలవ్యనగర్, స్వరాజ్ నగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్, శ్రీశైలం రస్తాలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలకు వాటర్‌ట్యాంక్‌లను శుభ్రపరిచి , ఫ్లోరింగ్ చేసి నీటిని అందించాలని చెప్పారు.

ద్విచక్రవాహనం అపహరణ

జూపాడుబంగ్లా: ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనం తెల్లవారే సరికి అపహరణకు గురైన ఘటన సోమవారం మండలకేంద్రంలో చోటుచేసుకొంది. బాధితుడు సయ్యద్ సాధిక్ తెలిపిన వివరాల మేరకు... స్థానిక సంతగేటు సమీపంలో నివాసం ఉంటున్న అతను నిత్యం తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఉంచి సైడ్‌లాక్ వేసి ఉంచుతాడు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారిన తర్వాత ఇంటి ముందుండాల్సిన తన బైక్ కనిపించక పోవడంతో కాలనీలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్థిక సాయం

మహానంది: ఈనెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో మహానందికి చెందిన సుబ్బరాయుడు గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. అతని కుటుంబానికి గ్రామానికి చెందిన గ్రామజ్యోతి యువజన సంఘం సభ్యులు రూ.10 ఆర్థిక సాయం అందిచారు. సంఘం అధ్యక్షుడు దమాల చందు, సభ్యులు శివరావు, రమణ, రఫి, మనోజ్‌రాజు, నూర్‌బాషా తదితరులు సోమవారం నగదును అందజేశారు.